సాక్షి
చిత్తూరు

బుధవారం । 26 । జూలై । 2023



'ఫుడ్'.. వెరీగుడ్

జిల్లాలోని మూడు మండలాల్లో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను మంగళవారం ప్రారంభించారు. - 8లో



పచ్చని శిలాతోరణం!

శేషాచల కొండలు పచ్చని తివాచీ పరుచుకుని ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	28	25
తిరుపతి	28	26
తిరుమల	23	21
గూడూరు	28	26
నగరి	29	26

న్యూస్‌రీల్

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అటవీ అధికారులు


వి.కోట: మండలంలోని ముదరందొడ్డి పంచాయతీ మద్దిమాకులపల్లెలో సోమవారం రాత్రి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. సుమారు 14 ఏనుగులు పంటలపై పడి ధ్వంసం చేశాయి. రాజగోపాల్, సుబ్రమణ్యం, రామకృష్ణారెడ్డికి చెందిన అరటి, మామిడి, మొక్కజొన్న, బొప్పాయి తోటలను నాశనం చేశాయి. గజబీభత్సంతో సుమారు రూ.3 లక్షల వరకు పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ అధికారులు మంగళవారం ఘటనాస్థలంలో పరిశీలించి పంట నష్టంపై నివేదికను పంపినట్లు డీఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

ఏబీఎన్..ఈనాడువి అసత్య కథనాలు

– ఎన్నికల అధికారి ప్రభాకర్ రెడ్డి

పుంగనూరు : జీరో డోర్ నంబర్లతో 34 వేల 664 మంది ఓటర్లు పుంగనూరు నియోజకవర్గంలో ఉన్నట్లు ఈనాడు ప్రచురించిన, ఏబీఎన్ ప్రసారం చేసిన కథనాలు అసత్యమని ఎన్నికల అధికారి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఈమేరకు ఆయన రాతపూర్వకంగా ప్రకటన విడుదల చేశారు. పుంగనూరు ఓటర్ల జాబితాలో కేవలం 862 మంది ఓటర్లు మాత్రమే డోర్ నంబర్ లేకుండా నమోదై ఉన్నట్లు వెల్లడించారు. అందులో బీఎల్‌ఓల ద్వారా 717 మంది ఓటర్ల డోర్ నంబర్లు సేకరించి ఫారం 8 ద్వారా నమోదు చేయించినట్లు వివరించారు. ఇంటింటా సర్వేలో మిగిలిన 145 మంది ఓటర్లకు కూడా డోర్ నంబర్లు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవడంతో డోర్ నంబర్ సమస్య తలెత్తినట్లు వెల్లడించారు. ఈనాడు, ఏబీఎన్ కథనాల్లో వాస్తవం లేదని స్పష్టంగా పేర్కొన్నారు.

సంక్షేమ సురక్ష



జగనన్న సురక్షలో సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు(ఫైల్)



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి రోజా (ఫైల్)

ప్రభుత్వ సేవలను సకాలంలో అందించాలి.. పేదలందరికీ పథకాల లబ్ధి చేకూరాలి.. ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలను చేర్చాలిన.. అర్హులందరి బతుకుల్లో నవరత్న వెలుగులు నింపాలి.. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తున్నారు. అందులో భాగంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జాప్యం లేకుండా ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టారు. వలంటీర్ల ద్వారా క్షేత్రస్థాయిలో సర్వే చేయించి యుద్ధప్రాతిపదికన సర్టిఫికెట్లు అందజేస్తున్నారు.

- అర్జీదారులకు త్వరితగతిన ధ్రువీకరణ పత్రాలు
- జగనన్న సురక్షలో జిల్లాకు 8వ స్థానం
- ఇప్పటి వరకు 1,77,124 సర్టిఫికెట్ల పంపిణీ
- సకాలంలో సేవలందిస్తున్న అధికారులు

సాక్షి, చిత్తూరు : గతంలో ప్రజలు చిన్న సర్టిఫికెట్ కావాలంటే కూడా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. కాళ్లరిగేలా తిరిగినా పనులు కావడం కష్టతరంగానే ఉండేది. అయితే వైఎస్సార్‌సీపీ సర్కారు ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలనను తీసుకువచ్చారు. 542 రకాల సేవలను సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు. అయినప్పటికీ ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో జాప్యం జరుగుతోందని గుర్తించారు. అర్హత ఉండీ సాంకేతిక కారణాలతో కొందరు ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారని తెలుసుకున్నారు. దీంతో ఆయా సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుక జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులు కోరిన వెంటనే 11 రకాల సర్టిఫికెట్లను ఇంటివద్దకే చేర్చేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ప్రజలకు సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు శ్రమిస్తోంది. ప్రస్తుతం జగనన్న సురక్ష అమలులో జిల్లా రాష్ట్రంలోనే ఎనిమిదో స్థానంలో నిలిచింది.

1,77,124 మందికి సేవలు

జిల్లాలో జగనన్న సురక్ష ద్వారా వివిధ సంక్షేమ పథకాలకు అర్హత ఉందని, తమను లబ్ధిదారుల జాబితాలో చేర్చాలని విన్నపాలు వచ్చాయి. ఈక్రమంలో జిల్లాలోని 610 సచివాలయాల పరిధిలో 4,14,091 గ్రామ సభలు నిర్వహించారు. ఇమొత్తం 1,77,124 మందికి వివిధ రకాల ప్రభుత్వ సేవలను అందజేశారు. కులం, జననం, మరణం, ఆదాయం, మ్యారేజ్, ఫ్యామిలీ మెంబర్, మ్యూటేషన్ సర్టిఫికెట్లు జారీ చేశారు. వీటితోపాటు రేషన్, ఆధార్, సీసీఆర్ కార్డులు అందజేశారు. వినతుల్లో 96శాతం ఇప్పటి వరకు పరిష్కరించారు. మిగిలిన వారికి టోకెన్లు జారీ చేశారు. విచారించి సర్టిఫికెట్లు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఎక్కడికీ వెళ్లకుండా.. ఎవరి సిఫార్సులు లేకుండా.. పైసా ఖర్చు లేకుండా అవసరమైన పత్రాలు అందిస్తుండడంతో అర్జీదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా సమాచారం

సర్టిఫికెట్ పేరు	లబ్ధిదారుల సంఖ్య
ఆదాయం	80,003
ఇంటిగ్రేటెడ్	80,745
ఆర్‌ఓఆర్ వన్‌బీ	2,266
అడంగళ్	618
జనన, మరణ	602
ఫ్యామిలీ మెంబర్	545
మ్యూటేషన్	175
ఇన్‌కమ్ అసెట్	51
పొజిషన్	51
ఓబీసీ	15
ఇతర పత్రాలు	15
ఆధార్	8,017
సివిల్ సప్లయిస్	3,643
జీఎస్‌డబ్ల్యూఎస్	273
ఆరోగ్యశాఖ	41
స్టాంపులు- రిజిస్ట్రేషన్లు	40
వ్యవసాయం	10
గ్రామీణాభివృద్ధి	10
మున్సిపల్	08

ఇంటి వద్దకే సర్టిఫికెట్



జగనన్న సురక్ష కింద క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి వారికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తులు తీసుకుంటున్నాం. పూర్తిస్థాయిలో విచారించి వారి ఇంటి వద్దకే సర్టిఫికెట్ తీసుకెళ్లి అందిస్తున్నాం. దీంతో ప్రజలు సంతృప్తి చెందుతున్నారు. దీంతో మాకు క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు ఉండడం లేదు.

– రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ, రొంపిచెర్ల

కోరిన వెంటనే మార్పు చేశారు



మా కుమార్తెకు వివాహమైంది. దీంతో రేషన్ కార్డులో ఆమె వివరాలు తీసేయాలని కోరిన వెంటనే మార్పు చేశారు.. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్ ఒక్క రోజులోనే మాకు పత్రాలు ఇప్పించారు. మా గ్రామానికి వచ్చిన జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ధ్రువీకరణపత్రాలను అందుకోవటం ఆనందంగా ఉంది.

– రమణమ్మ, తుంబపాళ్యం, బంగారుపాళ్యం మండలం

మేము సైతం



వలంటీర్ మా గ్రామంలో 50 ఇళ్లకు సేవలందిస్తున్నా. గతంలో వివిధ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు అనుమతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు జగనన్న సురక్ష కింద 11 రకాల సర్టిఫికెట్లు వెంటనే అందిస్తున్నాం. అర్జీదారులు కోరిన వెంటనే సర్వే నిర్వహించి పత్రాలు జారీ చేస్తున్నాం. ఇలాంటి కార్యక్రమంలో మేము సైతం భాగస్వాములు కావడం సంతోషంగా ఉంది.

– లక్ష్మీదేవి, వలంటీర్, అమ్మగారిపల్లె, సదుం మండలం

ఉచితంగానే పత్రాలు



జగనన్న సురక్షలో అర్జీ పెట్టుకున్న వారికి ఉచితంగానే కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నాం. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సకాలంలో అందరికీ లబ్ధి చేకూర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం.

– ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ, చిత్తూరు

లక్షల మందికి లబ్ధి



జగనన్న సురక్ష కార్యక్రమం కింద లక్షల మందికి లబ్ధి చేకూరుస్తున్నాం. ప్రజలు ఎలాంటి ఇబ్బంది పడకుండా సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా సేవలందిస్తున్నాం. సురక్ష కార్యక్రమం ద్వారా సకాలంలో వేగవంతంగా సమస్యలు పరిష్కరిస్తున్నాం. ఈ ప్రక్రియ మరిన్ని రోజులు కొనసాగుతుంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలి.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

పేదల అభ్యున్నతితోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం : పేదల అభ్యున్నతితోనే అభివృద్ధి సాధించినట్లని డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. మంగళవారం పచ్చికాపల్లంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్విరామంగా అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి విపక్షాలకు కడుపు మండుతోందన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే చంద్రబాబు ఓర్వలేక అసత్య ప్రచారానికి తెగబడుతున్నారని ఆరోపించారు. అమరావతిలో పేదలకు స్థలాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణం చేపడితే తట్టుకోలేక విషం కక్కుతున్నారని విమర్శించారు. పేదల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. విద్యార్థులను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దేందుకు విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని వెల్లడించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు పేదల చేసిన మేలు శూన్యమన్నారు. సింగపూర్ పేరుతో ప్రజలను మభ్యపెట్టారని మండిపడ్డారు. అందుకే పెత్తందార్ల కోసం పనిచేస్తున్న చంద్రబాబును ప్రజలు తిరస్కరించినట్లు వివరించారు. పవన్‌కల్యాణ్ ప్రగల్భాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. గతంలో కులం అడ్డుపెట్టుకుని రాజకీయం చేసేవారు నామరూపాల్లేకుండా పోయారని గుర్తుచేశారు. అదేవిధంగా 2024 ఎన్నికల తర్వాత పవన్, ఆయన పార్టీ కనుమరుగు కావడం తథ్యమని స్పష్టం చేశారు.

పేదల కోసమే పథకాలు

- చంద్రబాబు మోసాలను నమ్మవద్దు
- కుప్పం అభివృద్ధికి కట్టుబడి ఉంటాం
- పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వేదికపై ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్

కుప్పంరూరల్ : బడుగు, బలహీనవర్గాలు, రైతులు, మహిళలను దృష్టిలో ఉంచుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను రూపొందించినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం కుప్పం మండలం పల్లెబాటలో భాగంగా పలు సభల్లో ప్రసంగించారు. మంత్రి మాట్లాడుతూ అమ్మ ఒడి, ఆసరా, రైతు భరోసా ఇలా ఏ పథకం తీసుకున్నా పేదల అభ్యున్నతికే ప్రవేశపెట్టారన్నారు. చంద్రబాబు చెబుతున్నట్లు అభివృద్ధి అంటే రోడ్లు వేయడం కాదని, కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమని వెల్లడించారు. ముఖ్యమంత్రి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లక్షల రూపాయల లబ్ధి చేకూర్చారని చెప్పారు. 35 ఏళ్లు ఎమ్మెల్యేగా, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు కుప్పం ప్రజలకు చేసింది శూన్యమన్నారు. మరో మారు చంద్రబాబు మోసపు మాటలను నమ్మవద్దని కోరారు. 95శాతం హంద్రీనీవా పనులను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పూర్తి చేస్తే, 5శాతం పనులను చంద్రబాబు పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని, ఇప్పుడు మళ్లీ హామీలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తున్నారన్నారు. కుల, మత రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామని తెలిపారు. నిత్యం మీ మధ్యలోనే ఉండే ఎమ్మెల్సీ భరత్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ సభ్యుడు ఏడీఎస్ శరవణ, మున్సిపల్ చైర్మన్ సుధీర్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, నాయకులు నరేష్‌కుమార్‌రెడ్డి, మొగసాల రెడ్డెప్ప, మొగసాల కృష్ణమూర్తి, మురుగేష్, కుట్టి, రమేష్, షౌకత్, నారాయణప్రసాద్, గిరిప్రసాద్, సురేష్, గణపతి పాల్గొన్నారు.





పల్లెబాట సభలకు హాజరైన ప్రజలు

భవన నిర్మాణాల వేగవంతం

చిత్తూరు కార్పొరేషన్: ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్‌క్లినిక్ భవన నిర్మానాలకు సంబంధించి పెండింగ్ బిల్లులను 15 రోజుల్లోపు అప్‌లోడ్ చేయాలన్నారు. జలజీవన్ మిషన్ పనులను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఎస్‌ఆర్, ఎంపీ నిధులు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా చేపట్టిన పనుల్లో సమావేశంలో పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శంకర్‌బాబు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఉమామహేశ్వరరెడ్డి, డ్వామా పీడీ గంగాభవానీ పాల్గొన్నారు.

అసామాన్యంగా సుపరిపాలన



సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి రోజా

నగరి : సంక్షేమ పథకాలను అసామాన్యంగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా కొనియాడారు. మంగళవారం మండలంలోని అడవికొత్తూరులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 733 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా మహిళలు చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారన్నారు. నాలుగేళ్లుగా ముఖం చాటేసిన టీడీపీ నేతలు ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో తగుదునమ్మా అంటూ వస్తున్నారని విమర్శించారు. . వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉత్తుత్తి మాటలు చెప్పేది కాదని, చేతల్లోనే చూపిస్తుందని స్పష్టం చేశారు. ఒక్క అడవికొత్తూరు సచివాలయ పరిధిలోనే రూ. 40 లక్షల వ్యయంతో సచివాలయం, రూ.21.80 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రం భవనాలు నిర్మించామని, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో రోడ్లు, కల్వర్టులు ఏర్పాటు చేశామని వెల్లడించారు. పేదల గృహ నిర్మాణాల కోసం రూ. 77.4 లక్షలు, నాడు -నేడు పథకంలో రూ.80 లక్షలు, జలజీవన్ మిషన్‌లో రూ. 77.5 లక్షలు, మురుగుకాలువల నిర్మాణానికి రూ. 20 లక్షలు వెచ్చించినట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.8.57 కోట్లతో మొత్తం రూ. 12 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. ప్రత్యేకాధికారి వాసు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ లీలా మాధవి, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, సచివాలయాల కన్వీనర్ హరి, సర్పంచ్ రోశమ్మ, నాయకులు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

27న ఈపీఎఫ్ సమస్యలపై అవగాహన

చిత్తూరు కార్పొరేషన్: ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) సమస్యల పరిష్కారం కోసం గురువారం బంగారుపాళ్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈపీఎఫ్ఓ ప్రాంతీయ కమిషనర్ డాక్టర్ జ్ఞానేంద్రకుమార్ కనేజియా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మొగిలి గ్రామంలోని సీజీ ఫుడ్స్ కంపెనీలో సదస్సు ఉంటుందన్నారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు కొత్త సంస్థల కోసం ఓరియెంటేషన్ ప్రోగ్రామ్, 11–11.30 వరకు యజమానులు, కాంట్రాక్టర్దారుల కోసం, 11.30–12 వరకు చందాదారులు, పెన్షనర్ల కోసం ఆన్‌లైన్ సేవలు, 12 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొత్త కార్యక్రమాలు, సంస్కరణలపై ఓట్ రీచ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2– 2.30 గంటల వరకు మినహాయింపు పొందిన సంస్థ ప్రతినిధులతో ముఖాముఖి కొనసాగుతుందని వివరించారు.

కారు ఢీకొని యువకుడి మృతి

గంగవరం : మండలంలోని నాలుగురోడ్ల వద్ద మంగళవారం కారు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. పెద్దపంజాణి మండలం ఆకులవారిపల్లెకు చెందిన భానుప్రసాద్ (18) రెండు రోజుల క్రితం గంగవరం మండలం సరమట్లపల్లెలోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఆ గ్రామానికి చెందిన హేమాద్రి (17)తో కలిసి నాలుగు రోడ్లకు వెళ్లాడు. వర్షం కురుస్తుండడంతో పక్కనే ఉన్న చెట్టు కింద నిలబడ్డాడు. అదే సమయంలో బైరెడ్డిపల్లె నుంచి మాడి వైపు వెళుతున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఇద్దరు యువకులను ఢీకొంది. ఈ ప్రమాదంలో భానుప్రసాద్ అక్కడికక్కడే మరణించాడు. తీవ్రంగా గాయపడిన హేమాద్రిని చిత్తూరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి భానుప్రసాద్ మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోవడంతో సీసీ ఫుటేజీ ద్వారా ఆచూకీ కనుగొనేందుకు యత్నిస్తున్నారు.

ఫుడ్.. వెరీగుడ్!


శిలాఫలకాల ఆవిష్కరణలో కలెక్టర్ షణ్మోహన్, ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, ఎమ్మెల్యే వెంకటేగౌడ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని బైరెడ్డిపల్లె, సోమల, గంగవరం మండలాల్లో ఏర్పాటు చేసిన ఫుడ్ యూనిట్లను మంగళవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయన్నారు. బెంగళూరులో పంటలకు డిమాండ్ ఉందని, ఒక్కో ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా దాదాపు వెయ్యి మంది ఉద్యాన రైతులకు మేలు చేకూరుతుందని తెలిపారు. పంట నిల్వ, మార్కెటింగ్ కోసం జిల్లాలోని 64 ఆర్బీకేలకు అనుసంధానంగా 17 సేకరణ కేంద్రాలను రూ.2.55 కోట్లతో నిర్మించనున్నట్లు వెల్లడించారు. వీటి ద్వారా 6 వేల మంది రైతులకు ప్రయోజనం ఉంటుందని వివరించారు. పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ గంగవరం, బైరెడ్డిపల్లెలో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రైతులకు ఉపాధి దక్కుతుందన్నారు. పలమనేరు నియోజకవర్గం నుంచి నితయం 225 టన్నుల పండ్లు, కూరగాయలను పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. వి.కోటలో అదనంగా మరో యూనిట్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల సలహాదారుడు జ్ఞానేంద్రరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘అపూర్వ’ కలయిక


డాక్టర్ రాధా గిరిధర్ దంపతులను సత్కరిస్తున్న 1964 బ్యాచ్ వైద్యులు

తిరుపతి తుడా: తిరుపతి శ్రీవెంకటేశ్వర మెడికల్ కళాశాలకు వైద్యరంగంలో ఓ ప్రత్యేక స్థానం ఉంది. 1964లో ఎస్వీ మెడికల్ కళాశాల మొదటి బ్యాచ్‌తో వైద్య విద్య ప్రారంభమైంది. ఈ క్రమంలో మంగళవారం ఎస్వీ మెడికల్ కళాశాల 64 వ్యవస్థాపక దినోత్సవాన్ని భువన విజయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థులు సుమారు 30 మంది కలిశారు. వారు నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. వైద్య విద్యను అభ్యసించి అమెరికాలో స్థిరపడ్డ ప్రముఖ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ రాధా గిరిధర్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో వైద్య విద్యను అభ్యసించడం సంతోషంగా ఉందన్నారు. నాటి విద్యార్థులను కలుసుకోవడం మంచి అనుభూతి కలిగించిందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కలవడం ఆనందంగా ఉందని తెలిపారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ ప్రేమానంద్, డాక్టర్ హరినాథ్, డాక్టర్ బాలకృష్ణశెట్టి, డాక్టర్ రాఘవరెడ్డి, డాక్టర్ భారతి, రుయా, సూపరింటెండెంట్లు డాక్టర్ రవిప్రభు, డాక్టర్ పార్థసారథిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వసుంధర దేవి, డాక్టర్ వెంకట్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కారు టైరు పేలి..

- రెండు కార్లు ఢీ
- ఇద్దరు భక్తులకు స్వల్పగాయాలు


ప్రమాదంలో ఢీకొన్న కార్లు

తిరుమల : ప్రమాదవశాత్తు ఓ కారు టైరు పేలడంతో మరో కారును ఢీకొన్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. తిరుమల ట్రాఫిక్ పోలీసుల కథనం.. తిరుపతికి చెందిన రెండు ట్యాక్సీల్లో భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు రెండో ఘాట్ రోడ్డులో బయలుదేరారు. వాహనాలు ఘాట్ రోడ్లో వెళుతున్న సమయంలో అకస్మాత్తుగా ఓ కారు టైరు పేలి అదుపుతప్పి పక్కనే వెళుతున్న మరో కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో విజయవాడకు చెందిన ఇద్దరు భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. టీటీడీ ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కార్లను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

దూడను చంపిన చిరుత?

వి.కోట: మండలంలోని అనంతపురం గ్రామ శివారులో సోమవారం రాత్రి దూడపై చిరుత దాడి చేసి చంపేసినట్లు అటవీ అధికారులు అనుమానిస్తున్నారు. వివరాలు.. వెంకటేష్ అనే రైతు తన పొలం వద్ద ఆవులకు షెడ్డు ఏర్పాటు చేసుకున్నాడు. ఉదయం పొలం వద్దకు వెళ్లగా ఒక దూడ కళేబరం కనిపించింది. దీనిపై సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని దూడ కళేబరాన్ని పరిశీలించారు. చిరుత దాడి చేసిందా, లేక ఇతర జంతువు కారణంగా దూడ మరణించిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

సార్వత్రిక పాఠశాల సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

చిత్తూరు కార్పొరేషన్: ఏపీ సార్వత్రిక పాఠశాలలో పదోతరగతి, ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలైనట్లు డీఈఓ విజయేంద్రరావు మంగళవారం తెలిపారు. ఇంటర్ పరీక్షలో 382 మంది విద్యార్థులకు గాను 267 మంది ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. పదిలో 243 మంది హాజరు కాగా 151 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు.


తిరుపతిలో శేషాచలం కొండలు

సేమ్ టూ సేమ్


వెంకటగిరి వద్ద ఉన్న కొండ

ప్రపంచంలో మనుషులు పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని పెద్దలు చెబుతుంటారు. ఈ కోవలోనే ఇద్దరూ.. ఇద్దరే అన్నట్టు కవల పిల్లలు ఉండడాన్ని అందరూ గమనిస్తుంటారు. కానీ కొండను పోలిన కొండలు ఉండడం ఇప్పుడే చూస్తున్నాం. తిరుమల శేషాచల కొండలు మాదిరే వెంకటగిరి వద్ద ఉన్న కొండలూ ఉన్నాయి. వీటిని చూసిన వారు సేమ్ టూ సేమ్ అని చెబుతున్నారు.. ఇదంతా ఆ కలియుగ వెంకన్న మహిమే అని భక్తులు, ప్రకృతి ప్రేమికులు చర్చించుకుంటున్నారు. ఈ దృశ్యాలు సాక్షి కెమెరా బంధించింది.

-ఫొటోలు : - ఎస్‌కే.మహమ్మద్ రఫీ, సాక్షి ఫొటో గ్రాఫర్, తిరుపతి

శ్రీవారి సేవలో ప్రముఖులు


సినీ నటి రమ్యకృష్ణ , ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు , ఎమ్మెల్సీ కళ్యాణి, యాంకర్ బిత్తిరి సత్తి , ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం సినీ నటి రమ్యకృష్ణ, ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ కళ్యాణి, యాంకర్ బిత్తిరి సత్తి, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా సత్కరించారు.

పులికాట్‌లో పూడిక తీత ప్రక్రియ
వేగవంతం చేయండి


కేంద్ర మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : పులికాట్ సరస్సు ముఖద్వారం వద్ద పూడికతీత ప్రక్రియను వేగవంతం చేయాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి కోరారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ భూషణ్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. పులికాట్ ముఖద్వారం ఇసుక మేటలు వేసి పూడిపోవడంతో ఎండా కాలం సరస్సులో నీటి మట్టం తగ్గి చేపల వేట లేక మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పులికాట్ ముఖద్వారం పూడిక తీతకు సహకరించాలని పార్లమెంట్లో పలుమార్లు కేంద్రం దృష్టికి తీసుకొచ్చినట్టు గుర్తుచేశారు. కేంద్రం ప్రభుత్వ ప్రతిపాదిత అంచనా మొత్తం రూ.128.80 కోట్లు వెచ్చించనున్నట్టు తెలిపారు. మత్స్యకారుల జీవనోపాధిని మెరుగు పరిచేందుకు సహకరించాలని ఎంపీ అభ్యర్థించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై చర్యలేంటి?


ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటని ఎంపీ గురుమూర్తి ప్రశ్నించారు. మంగళవారం ఆయన ఢిల్లీలోని పార్లమెంట్‌లో జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. ఫుడ్ ప్రాసెసింగ్ సౌకర్యాల కొరత కారణంగా రైతులు పండించిన ఉత్పత్తులను విక్రయించుకోలేక రైతులు తమ ఉత్పత్తులపై లాభాలను కోల్పోతారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 2 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ రకాల పండ్ల తోటలు ఉన్నాయని, ఈ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపిస్తే పండ్లు, కూరగాయల డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. దీనిపై కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్‌పటేల్ సమాధానమిస్తూ ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన ద్వారా సంబంధిత మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపన, విస్తరణ కోసం పారిశ్రామికవేత్తలకు గ్రాంట్స్–ఇన్–ఎయిడ్ రూపంలో క్రెడిట్ లింక్డ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ (క్యాపిటల్ సబ్సిడీ) అందిస్తోందన్నారు. ఈ పథకం కింద పండ్లు, కూరగాయలతో సహా మొత్తం 11 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పనున్నట్టు పేర్కొన్నారు. 2021–22 నుంచి 2026–27 వరకు ఆరేళ్ల వ్యవధిలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రాజెక్టులలో మొత్తం రూ.1387.03 కోట్ల పెట్టుబడి పెట్టుబడి పెట్టినట్టు వివరించారు.

కర్ణాటక మద్యం విక్రేతల అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ అర్బన్ పోలీసులు


నిందితుడు, సీజ్ చేసిన మద్యంతో ఎస్ఈబీ రూరల్ పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. గుడిపాల మండలం పిళ్లారికుప్పంలో సీఐ జోగేంద్ర, టాస్క్‌ఫోర్స్ సీఐ మాధవస్వామి తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. హరికృష్ణ (34) అనే వ్యక్తి ఇంట్లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడి నుంచి 55 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. బంగారుపాళ్యం మండలం టేకుమందలో ఎస్ఈబీ సీఐ చంద్రశేఖర్ దాడి చేసి వి.జగన్నాథం (55) అనే వ్యక్తి ని అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 48 టెట్రా ప్యాకెట్లు, ద్విచక్రవాహనం సీజ్ చేశారు. కోర్టు ఆదేశాలతో నిందితులను జిల్లా జైలుకు తరలించారు.





శేషాచలం..పచ్చని శిలాతోరణం!



శేషాచలం అడవులు పచ్చని తివాచీ పరుచుకుని కనువిందు చేస్తున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న తుంపర వర్షాలకు పురివిప్పుకుని పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. తిరుమలకు కాలినడకన వెళ్లే భక్తుల మనసుకు ఆహ్లాదానిస్తూ ఆనందడోలికల్లో ముంచెత్తుతున్నాయి. వాహనాల్లో వెళ్లేవారి చూపు తిప్పుకోనీయకుండా కట్టిపడేస్తున్నాయి. దట్టంగా కప్పేస్తున్న కరిమబ్బుల మధ్య తిరుమల అందాలు మరింత మెరిసిపోతున్నాయి. మూడు నామాలవాడిని స్మరిస్తూ.. తెలిమంచు తెరలు చీల్చుకుంటూ.. శేషాచలాన్ని అధిరోహిస్తూ.. భక్తులు పరవశించిపోతున్నారు. - తిరుమల

